

# నీడనిచ్చే చెట్టు

ఆలపర్తి రామకృష్ణ

''ఓస్! దీని మూలంగానే యింటికిన్ని అనర్థాలు ... దీన్ని కొట్టేస్తే పీడ విరగడవుతుంది."

గట్టిగా అరుస్తూ గొడ్డలి తీసుకుని వేపచెట్టుని నరకటానికి బయల్దేరేడు వీరయ్య.

దొడ్లో వేపచెట్టును చూస్తే చాలు వీరావేశం వస్తుంది వీరయ్యకి.

కిందటినెల్లో సిద్ధాంతి వొచ్చినప్పటి నుంచే ఆ చెట్టుపై అంత కోపం. పెరట్లో ఈశాన్యం మూలలో వేపచెట్టు వుంటే యింట్లో అన్నీ అనర్థాలేనని వక్కపొడి నములుతూ సిద్ధాంతి చెప్పాడు.

నెలనెలా యింటికి డబ్బుపంపే పెద్ద కొడుకు డబ్బు పంపకపోవడం, రాయిలా తిరుగుతూ పనిచేసుకునే రంగమ్మకి సుస్తీచెయ్యడం, చిన్నకొడుక్కి మంచి

ఉద్యోగం దొరక్కపోవడానికి కారణం ఆ వేపచెట్టేనని వీరయ్యకనిపించింది.

చాపచుట్టలా వేపచెట్టుకింద పడుకున్న రంగమ్మ తెరచాపలా లేచి వీరయ్యకు అడ్డమొచ్చింది. భర్త వేపచెట్టుని కొట్టెయ్యాలనుకోవడం ఆమెకు సుతారామూ యిష్టంలేదు. దాదాపు పగలంతా ఆ చెట్టుకిందే ఆమె కాలక్షేపం చేస్తుంది. చెట్టుదగ్గరి నీడలోనే బట్టలుతకడం, అంట్లు తోముకోవడం, తాటాకుల దడిలో స్నానం.... వేసవికాలం ఆ చెట్టుకిందే పడక.... అందుకే నాల్గోసారి వీరయ్యకు అడ్డమొచ్చింది చెట్టు కొట్టెయ్యబోతూ వుంటే.

"చెట్టుకొట్టేస్తే మనకష్టాలు తీరతాయా ఏమిటి? దేవుడు మన తలరాత ఎలా రాస్తే అలా జరుగుతుంది... చెట్టు మాత్రం కొట్టెయ్యడానికి వీల్లేదు" అంది రంగమ్మ.

వాళ్ళ గొడవకి సూరిబాబుకు మెలకువ వొచ్చింది. సూరిబాబు కూడ కలుగజేసుకుని తండ్రిని వారించడంతో వీరయ్య వెనక్కు తగ్గాడు.

బండమీద కూర్చుని మొహం కడుక్కుంటూ తండ్రి కోపానికిగల కారణాలు వెతుక్కోసాగేడు సూరిబాబు.

సిద్ధాంతి మాటకంటే అన్నయ్య ప్రవర్తనే నాన్న కోపానికి అసలు కారణం.. రెండు నెలలయ్యిందట అన్నయ్య డబ్బులు పంపించి.... అన్నయ్యచేత ఉత్తరం వ్రాయించింది వొదిన, డబ్బులు పంపడం వీలుపడదని.... అమ్మని నాన్నని వాళ్ళ దగ్గరకొచ్చి వుండమంటారు. ఇల్లు, వాకిలి వొదిలిపెట్టి అక్కడికెళ్ళడం అమ్మ, నాన్నకి యిష్టంలేదు.

ఆ ముచ్చటా తీరింది అమ్మానాన్నకి: రెండురోజులు వుండి వొచ్చారు ఆ మధ్య. ఆ రెండు రోజులూ రెండు యుగాల్లా తోచేయి.... ఛీటికీమాటికి వొదిన కసురుకునేదట. సోఫాల్లో కాళ్ళు పెట్టుకుని కూర్చున్నారని, అమ్మ పొద్దున్నే చద్దన్నం తిన్నాదని, నాన్న చుట్టలు తాగాడని– ఏదో వొంకతో అమ్మనీ, నాన్నని ఈసడించింది వొదిన.

అన్నయ్య మునిసిపల్ కమీషనర్ అవ్వకపూర్వం తనంటే ఎంతో ప్రేమగా వుండేవాడు.

....పదో తరగతి తప్పి ప్రింటింగ్ ప్రెస్‌లో బైండర్‌గా, హోటల్లో సప్లయర్‌గా, సినిమా హాల్లో గేటుదగ్గర నిలబడి టికెట్లు చించడం– ఎన్నో చిన్న చిన్న ఉద్యోగాలు చేశాడు తను. వున్న ఎకరం పొలం అమ్మి అన్నయ్యని బి.ఎ. చదివించేడు నాన్న. ఏదొక పనిచేసి ఇంటిభారం తను నెత్తిన వేసుకున్నాడు. అందుకనే అన్నయ్యకి తనంటే ఎంతో అభిమానం....

సర్వీస్ కమీషన్ పరీక్షలు ప్యాసయి మున్సిపల్ కమీషనర్ ఉద్యోగం దొరికేక అన్నయ్య పూర్తిగా మారిపోయేడు.

అమ్మానాన్నలకి చెప్పకుండానే తను పని చేస్తున్న ఊళ్ళోని తాసీల్దారుగారి అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడు. దూరపు బంధువుల్లా తామెళ్ళి పెళ్ళిచూసి వచ్చేరు. పెళ్ళినుంచి తిరిగొచ్చేక అమ్మ, నాన్న ఎంత బాధపడ్డారో!

....అన్నయ్యకి తనుచేసే మున్సిపల్ ఆఫీసులోని 'స్వీపర్' ఉద్యోగం నచ్చదు. ఆ ఉద్యోగం మానెయ్యమంటాడు. తన యింటి సంగతి పట్టించుకోడు.... అతి కష్టంమీద సంపాదించుకున్న ఆ ఉద్యోగం కూడా మానేస్తే పస్తులుండాల్సిందే!....

"మీ ఆఫీసు వేళవుతుందిరా! త్వరగా తెములు!" రంగమ్మ హెచ్చరించడంతో, గబగబా వేపపుల్ల నమిలేసి, మొహం కడుక్కుని యింట్లో కొచ్చేసేడు సూరిబాబు.

* * *

సూరిబాబు యింట్లోంచి బయటపడే సరికి మున్సిపాలిటీ వ్యాన్ ఎదురయ్యింది.

అతన్నికూడ వ్యాన్‌లో ఎక్కించుకున్నారు.

వ్యాన్‌లో చిన్న చిన్న 'కేజ్' లున్నాయి. వాటిల్లో వీధుల్లో పట్టుకున్న కుక్కల్ని వుంచేరు.

రోడ్డుపక్కనే గజ్జికుక్క కన్పించడంతో వ్యాన్ ఆగింది. పొడుగాటి తాడు వూపుకుంటూ 'డాగ్ క్యాచర్' ఆ గజ్జికుక్క వెనకపడ్డాడు. నాలుగు వీధులూ తిప్పి రొప్పుకుంటూ ఓ చోట ఆగింది కుక్క. అదే అదనుకుని గురిచూసి కుక్కమెడకేసి విసిరేడు తాడు.

కుక్క ముందుకు వురకడం తాడు వెనక్కు లాగడంతో కుక్క మెడకి వున్న ఉచ్చుముడి బిగుసుకుపోయింది.

"కుయ్.... కుయ్" మంటూ మొరగడం మొదలుపెట్టింది గజ్జికుక్క. దాన్ని లాక్కెళ్ళి 'కేజ్'లో పడేసేడు.

వ్యాన్‌లో వున్న కుక్కలు కొత్త కుక్క రావడంతో కాసేపు మొరిగేయి.

ఆ కుక్కలకేసి జాలిగా చూసేడు సూరిబాబు.

వాటి ఆయుర్దాయం మరో ఏడుగంటలు. తిండితిప్పలు లేకుండా ఆరోజు గదిలో వాటిని వుంచుతారు. మరునాటి రోజు శానిటరీ కాంపౌండర్ వొచ్చి వాటి గుండెల్లోకి సూటిగా ఇంజెక్షన్ చేస్తాడు. క్షణాల్లో వాటి ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి.

మరో క్షణంలో పక్కింటి శివుడు గుర్తుకురాగానే వాటిమీద ఏర్పడిన జాలి ఎగిరిపోయింది.

...శివుడికి ఆరేళ్ళు వుంటాయి. బొద్దుగా, తెల్లగా, అందంగా వుండేవాడు. వాడిని పిచ్చికుక్క కరిచింది. మొదట్లో ఇంటిదగ్గర ఎవ్వరూ పట్టించుకోలేదు. కొండ ఆకు రాసి ముక్కుపట్టు పట్టారు. గాని లాభం లేకపోయింది. రోగం ముదిరిపోయింది.

నాలుక బయటపెట్టి దీనంగా చూస్తుండే వాడు. "దాహం, దాహం"- అంటూ విలవిల్లాడిపోయేవాడు. మంచినీళ్ళు తెచ్చి యిస్తే బెదిరిపోయి దూరంగా వెళ్ళేవాడు. కుక్కలా ముడుచుకుని పడుకునేవాడు.

చివరి రోజుల్లో కుక్కలా అరుస్తూ ప్రాణాలు విడిచేడు.

ఆఫీసు దగ్గర వ్యాన్ ఆగడంతో ఆలోచనలనుంచి తేరుకుని వ్యాన్‌లోనుంచి కిందకు దూకేడు.

ఆఫీసుకెళ్ళగానే వున్న కమీషనర్ ట్రాన్స్‌ఫరై, కొత్తాయన వస్తున్నట్లు తెలిసింది. ఎవరొచ్చినా తన బ్రతుకు మామూలేగదా అనుకుంటూ తన పనిలో తాను మునిగిపోయేడు సూరిబాబు.

నాలుగింటికి కమీషనర్ సూరిబాబు కోసం కబురుచేశాడు.

సూరిబాబుకు ఆశ్చర్యమేసింది. తన రెండేళ్ళ సర్వీసులో తననెప్పుడూ కమీషనర్ ప్రత్యేకంగా పిలిపించలేదు.

గదిలోకి వెళ్ళగానే సూరిబాబును కూర్చోమని సంజ్ఞచేశాడు.

ఆయన తనని కూర్చోమనడం వింతగా తోచింది.

"చూడు సూరిబాబూ! నా కిక్కడ నుంచి పొన్నూరుకు ట్రాన్స్‌ఫర్ వొచ్చింది. కొత్త కమీషనర్‌గారు రేపు చార్జితీసుకుంటారు."

ఆ విషయాలు తన కెందుకు చెబుతున్నాడో సూరిబాబుకు అర్థంకాలేదు.

"కొత్త కమీషనర్ ఎవరో తెలుసా? మీ అన్నయ్యే!" అన్నాడాయన నవ్వుతూ.

సూరిబాబుకు ఎంతో సంతోషమేసింది. అన్నయ్య ఈ వూర్లోనే వుంటే అమ్మ, నాన్నకి ఎంతో ఆసరాగా వుంటాడనుకున్నాడు.

అతని సంతోషం ఆవిరైపోవడానికి ఎంతోసేపు పట్టలేదు.

"నువ్వేమనుకోకుండా వుంటే వో విషయం చెబుతానోయ్!"- సూరిబాబు కళ్ళలోకి చూస్తూ అన్నాడాయన.

"చెప్పండి సార్!"

"మీ అన్నయ్య దగ్గర నువ్వు 'స్వీపర్'గా పనిచెయ్యడం బాగుండదయ్యా! ఆయన సోషల్ ప్రిస్టేజి దెబ్బతింటుంది. నా మాట విని నువ్వు వేరే ఉద్యోగం చూసుకో! మీ అన్నయ్య ఫోన్‌చేసి ఈ విషయం చెప్పేడు."

సూరిబాబు బాధపడ్డాడు.

....అన్నయ్యే స్వయంగా వొచ్చి ఆ విషయం చెబితే ఎంత బాగుండేది. తనకేమీ ఈ ఉద్యోగంమీద మమకారం లేదు. 'తుమ్మితే వూడిపోయే ముక్కు' లాంటి ఉద్యోగాలు ఎన్నో చేశాడు తను. అన్నయ్య తన ఉద్యోగాన్ని చిన్నచూపు చూస్తున్నాడు గాని ఆ చిన్న ఉద్యోగాలు

చేసి తను సంపాదించిన డబ్బుతోనే అన్నయ్య సర్వీస్ కమీషన్ పరీక్షల ఫీజు కట్టింది, ఆ రోజుల్లో తను కష్ట పడుతున్నానని తెగ పొగిడేసేవాడు.... యిప్పుడు తను 'స్వీపర్' వుద్యోగం చెయ్యడం అన్నయ్య సహించలేడు....

విరక్తిగా నవ్వుతున్నాడు.

"సార్! నాకో తెల్లకాగితం యిస్తారా?" అన్నాడు నెమ్మదిగా.

• • •

సూరిబాబు తేలికపడిన మనస్సుతో యింటికి చేరుకున్నాడు.

ఇంటిముందు ఆవరణంతా అక్రమించిన మామిడిచెట్టుకింద మాట్లాడుకుంటున్న అన్నయ్య, తండ్రి కన్పించేరు అతనికి.

సూరిబాబు కన్పించగానే విసవిసా నడుస్తూ అక్కడనుంచి వెళ్ళిపోయాడు ప్రసాదు. సూరిబాబు పలకరించబోయినా విన్పించుకోలేదు.

మామిడిచెట్టుకింద దిగులుగా నిలబడ్డ తండ్రిని చూడగానే సూరిబాబు మనస్సు కలిచివేసింది.... ఆ మామిడిచెట్టంటే నాన్న కెంతో ప్రాణం... జాగ్రత్తగా పెంచేడు.... ఆ చెట్టు విస్తారంగా పెరిగిందేగాని కాయలు కాయడం మాత్రం మర్చిపోయింది...

"అన్నయ్య యిప్పుడే వచ్చాడురా! ఇక్కడే ఉద్యోగం అయ్యిందట.... మీ అమ్మ, నేనూ వాడిదగ్గరే వుండాలట ....ఈ యింట్లో వుండలేరట.... పైగా నువ్వు ఉద్యోగం మానెయ్యాలట.... 'నీ సహాయం అక్కర్లేదు.... నువ్వూ అక్కర్లేదు నోరుమూసుకొని పొమ్మన్నాను'...."- అన్నాడు వీరయ్య ఆవేశంతో.

"నేనున్నాను నాన్నా! ఈ గుండెల్లో వూపిరి వున్నంతకాలం మీ కేలోటు రానివ్వను నాన్నా!" అన్నాడు సూరిబాబు మనస్ఫూర్తిగా.

పగలంతా మామిడిచెట్టుకిందే కాలక్షేపంచేసే వీరయ్య, ఆ రోజునుంచి దొడ్లో వేపచెట్టుకిందే కాలక్షేపం చెయ్యసాగేడు.

